క్లుప్తంగా

ఆస్పత్రిలో వసతులు కల్పించాలి



వీపనగండ్ల: మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులకు మెరుగైన వసతులు కల్పించాలని కోరుతూ ధర్మసమాజ్ పార్టీ జిల్లా నాయకులు వీరపాగ రామకృష్ణ, స్వామి కోరారు. శనివారం ఆస్పత్రిలోని వైద్యాధికారి ప్రియాంకను కలిసి ఆస్పత్రిలో ఉన్న ఖాళీల వివరాలు, ల్యాబ్స్, పేషెంట్లకు అందుతున్న వసతులను తెలుసుకున్నారు. కార్యక్రమంలో అశోక్, బలరాం, కుర్మయ్య ఉన్నారు.

చదువుతో పాటు ఆరోగ్యం ముఖ్యం



ఆత్మకూర్: విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్, స్త్రీశిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారులు లక్ష్మమ్మ, జ్యోతి, నర్మద, శ్రీలత అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 2, స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ్ బీ బౌర్ పడాయిబీ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు షకీల్‌అహ్మద్, చక్రపాణిరెడ్డి, గిరిధర్ ఉన్నారు.

విద్యుత్ టవర్ పోల్స్ మంజూరు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు అవసరమైన విద్యుత్ టవర్ పోల్స్ మంజూరయ్యాయని కాంగ్రెస్ మండల నాయకుడు ఆగారం ప్రకాష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో ఒకే స్తంభానికి 33 కేవీ, సాధారణ విద్యుత్ లైన్లు ఉండటంతో పాటుగా చాలా ప్రాంతాల్లో వైర్లు ఇళ్లను ఆనుకునే విధంగా ఉండటంతో గ్రామస్తులు పలుమార్లు నాయకులకు మొరపెట్టుకున్నారని పేర్కొన్నారు. ఎట్టకేలకు వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రత్యేకంగా దృష్టిసారించి అవసరమైన టవర్ పోల్స్ మంజూరు చేయించారని తెలిపారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

చిన్నంబావి: అమ్మాయిపల్లిలో శ్రీరాముడి ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన హైమాస్ట్ లైట్లను కాంగ్రెస్ మండల నాయకులు శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ సమస్య ఉందని ప్రజలు మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లగా.. హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో రామచంద్రరెడ్డి, కృష్ణాప్రసాద్‌యాదవ్, బీచుపల్లి యాదవ్, రంజిత్ కుమార్, తేజారెడ్డి, బిచ్చన్న, ప్రభంజన్‌గౌడ్, పార్థసారథి గౌడు, విష్ణుగౌడు, వెంకటేష్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు..

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

వనపర్తిటౌన్: సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరయిన చెక్కులను ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆదేశాల మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని 18వ వార్డులో లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు శరవంద, ద్యారపోగు వెంకటేష్ అందజేశారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్, గజ్జల సుబ్రహ్మణ్యం, వినయ్, గజ్జల విజయ్, అంజి ఉన్నారు.

అదుపు తప్పిన కారు: ముగ్గురికి గాయాలు

కొత్తకోట రూరల్: అతివేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన గల చెట్ల పొదల్లోకి దూసుకెళ్లడంతో ముగ్గురికి గాయాలయిన ఘటన శనివారం కొత్తకోట సమీపంలో ఎన్‌హెచ్44పై చోటు చేసుకుంది. స్థానికులు సమాచారం మేరకు.. బీహార్‌కు చెందిన ముగ్గురు యువకులు కారులో బెంగుళూర్ వెళ్తుండగా కొత్తకోట సమీపంలోకి రాగానే కారు అతివేగంగా ఉండటంతో అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. స్థానికులు వెంటనే అప్రమత్తమై కారులో ఇరుక్కున్న వారిని బయటకు తీశారు. కారులో ఉన్న అజాద్, అభిలేష్, అస్లాం కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములమవుదాం

అమరచింత: మస్తీపురం అభివృద్ధిలో ప్రజలతో పాటు యువకులు భాగస్వాములు కావాలని తహసీల్దార్ రమేష్‌రెడ్డి అన్నారు. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి శనివారం గ్రామసభను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ నూతన భవనం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి స్థలం కేటాయించాల్సి ఉందన్నారు. వీటికోసం గ్రామకంఠం భూములను గుర్తిస్తున్నామన్నారు.

సాగునీరు రాక ఇబ్బందులు



కొత్తపేట సమీపంలో ఎండిపోయిన కేఎల్ఐ కాల్వ

- కేఎల్ఐ కాల్వకు 20 రోజులుగా నిలిచిన నీరు
- ఎండుతున్న పంటలు
- ఆందోళనలో అన్నదాతలు



కొత్తపేట శివారులో నెర్రలు వాలిన వరి పైరును చూపుతున్న ఆంజనేయులు

పాన్‌గల్: కాల్వల ద్వారా సాగునీరు అందుతుందనే ఉద్దేశ్యంతో మండలంలో రైతులు వరి పంటలను సాగు చేశారు. 20 రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు కాల్వలు కోతకు గురయ్యాయి. దీంతోపాటు కాల్వలో పేరుకుపోయిన షీల్టును తొలగించే నిమిత్తం కాల్వకు సాగునీటి సరఫరాను నిలిపివేశారు. దీంతో సాగునీరు అందక పంట పొలాలు నెర్రలు పారాయి. రూ.వేలు ఖర్చుపెట్టి సాగుచేసిన పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పాన్‌గల్, కొత్తపేట, దొండాయిపల్లి గ్రామాల మీదుగా ఉన్న కేఎల్ఐ కాల్వకు నీటి సరఫరా కావడంలేదని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాల్వల వెంట పర్యవేక్షణ చేస్తూ చివరి ఆయకట్టు పొలాలకు సాగునీరు చేరే విధంగా తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పంటలు ఎండుతున్నాయి

కాల్వల ద్వారా సాగునీరు సాఫీగా సరఫరా అవుతుందని నాలుగు ఎకరాలను కౌలుకు తీసుకొని వరి పంటను సాగుచేశాను. 20 రోజులుగా కాల్వ ద్వారా సాగునీరు సరఫరా కాక పొలాలు నెర్రలు బారింది, దీంతో పంటలు ఎండుమొఖం పట్టాయన్నారు. ఎకరాకు రూ.30 వేలు ఖర్చయింది. దీంతోపాటు కౌలు డబ్బులు చెల్లించడం కూడా భారంగా మారుతుంది. దీంతో దిక్కుతోచని పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాల్వల ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీరు సాఫీగా వచ్చేలా చర్యలు తీసుకుంటూ పంటలను కాపాడాలి.

– గునమోని ఆంజనేయులు, రైతు, కొత్తపేట

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

పస్పుల బ్రాంచ్ కెనాల్ ద్వారా తక్కువ మోతాదులో నీరు సరఫరా అవుతుండటంతో చివరి ఆయకట్టు గ్రామాల రైతులకు సాగునీరు చేరడం లేదు. విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాగునీరు విడుదల పెంచే విధంగా చర్యలు తీసుకుంటూ రైతుల ఇబ్బందులను తొలగిస్తాం.

– వెంకటేష్, ఇరిగేషన్ ఏఈ

రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయం

ఆత్మకూర్: కేంద్రంలోని బీజేపీ కూటమి ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పరమేష్, రహ్మతుల్లా, తులసీరాజ్‌యాదవ్, నల్గొం శ్రీను అన్నారు. శనివారం స్థానిక అతిథి గృహంలో వారు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ విధానాలపై ప్రజల్లో రోజురోజుకూ అసహనం పెరుగుతుందని పేర్కొన్నారు. ఈనెల 23న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, బాలకిష్టాపూర్‌లో రూ.500లకు సిలిండర్ ప్రొసీడింగ్ కాపీ పంపిణీ ఉంటుందని, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరు కావాలని కోరారు.

లడ్డూ ప్రసాదం వితరణ



ఆత్మకూర్: పట్టణంలోని బీసీకాలనీలో ఏర్పాటు చేసిన 21 అడుగుల మహా గణనాథుడి చేతిలోని లడ్డూ ప్రసాదాన్ని వేలంలో వార్డు మాజీ సభ్యుడు గద్దమీది గాయత్రి శ్రీనివాసులు రూ.4.60 లక్షలకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆరో వార్డులోని బీసీకాలనీలో శనివారం లడ్డూప్రసాదాన్ని ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో భరత్, కాలనీవాసులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల

అమరచింత: కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 23న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తూ సంక్షేమ భవన్ ముట్టడి చేపడుతున్నట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌ఈ శ్యాంసుందర్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో శనివారం చలో సంక్షేమ భవన్ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు, అజయ్, విజయ్, అరుణ్, సతీష్‌లు పాల్గొన్నారు.

భర్త కాపురానికి తీసుకెళ్లలేదని మహిళ అదృశ్యం

ఖిల్లాఘనపురం: భర్త కాపురానికి తీసుకెళ్లలేదని మహిళ అదృశ్యమైన ఘటన ఈ నెల 17న చోటు చేసుకోగా.. శనివారం మహిళ తల్లి పాలకొంగ సూర్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సురేష్‌గౌడ్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. మానాజీపేటకు చెందిన పాలకొండ సూర్యమ్మ కుమార్తె జ్యోతిని నాగర్‌కర్నూల్‌కు చెందిన కొత్త మల్లికార్జున్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఏడేళ్ల కూతురు ఉంది. దంపతుల మధ్య తగాదాలు రావడంతో 6 నెలలుగా జ్యోతి తన పుట్టింటి వద్దే ఉన్నారు. కాగా మల్లికార్జున్ తనకు కూతురును ఇంటికి తీసుకెళ్లి.. భార్య కాపురానికి రావడం లేదని కోర్టులో విడాకుల కోసం దరఖాస్తు చేశాడన్నారు. విషయం తెలుసుకున్న జ్యోతి ఈ నెల 17న ఉదయం 9 గంటల సమయంలో ఎవ్వరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. గ్రామంలో, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో శనివారం బాధితురాలి తల్లి సూర్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్‌గౌడు తెలిపారు.

ఐఎంఏ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ పీజే బాబు

కొత్తకోట: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) అసోసియేషన్ వనపర్తి జిల్లా అధ్యక్షుడిగా కొత్తకోట పట్టణ కేంద్రానికి చెందిన ప్రముఖ చిన్న పిల్లల వైద్యుడు డాక్టర్ పీజే బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలువురు డాక్టర్లు ఆయన్ను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఇంద్రనీల్, జిల్లా ఉపాధ్యక్షుడిగా డాక్టర్ భరత్‌కుమార్, కోశాధికారిగా డాక్టర్ మోహన, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ చైతన్య ఎన్నికయ్యారు.

భూవివాదంపై విచారణ

వీపనగండ్ల: మండల కేంద్రంలోని 60 ఎకరాల ఇనాం భూమిపై పలు దళిత కుటుంబాల మధ్య విభేదాలు చోటు చేసుకోవడంతో శనివారం జిల్లా ఉన్నతాధికారుల ఆదేశానుసారం రెవెన్యూ, పోలీస్ అధికారులు మోకాపైకి వెళ్లి విచారణ చేపట్టారు. వీపనగండ్ల శివారులోని సర్వే నెంబర్ 398, 588 లతో పాటు పలు సర్వే నెంబర్లలో 60 ఎకరాల ఇనాం భూమి ఉండగా.. అందులో గ్రామానికి చెందిన తప్పెట రంగయ్య వీరయ్య, కాశయ్య, నర్సింహ తదితర దళిత కుటుంబాల వారు మోకాపై ఉండి పొలాన్ని సాగు చేసుకుంటున్నారు. ఇదే గ్రామానికి చెందిన మరో వర్గం వారు తోలు మాంకాలి, మల్లయ్య, నాగులయ్య, అంబయ్య వారసులు కూడా మోకాపై ఉండి భూమిని సాగు చేసుకుంటున్నారు. ఇరువర్గాల మధ్య విస్తీర్ణం, హద్దుల విషయంలో విభేదాలు వచ్చాయి. ఈ భూమిపై ఉన్నతాధికారుల సూచనల మేరకు మోకాపైకి వెళ్లి సర్వేయర్లతో సర్వే చేయించామని తహసీల్దార్ వరలక్ష్మి తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి, ఎస్‌ఐ రాణి, చిన్నంబావి ఎస్‌ఐ రమేష్, సర్వేయర్లు, ఇరువర్గాల రైతులు పాల్గొన్నారు.



సర్వే చేయిస్తున్న తహసీల్దార్ వరలక్ష్మి

స్వచ్ఛత అందరి బాధ్యత

ఆత్మకూర్: పట్టణంలోని శ్రీవాణి ఉన్నతపాఠశాలలో శనివారం స్వచ్ఛ భారత్– స్వచ్ఛ ఆత్మకూర్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛతహీ సేవా 2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజులు మాట్లాడుతూ తడి, పొడి చెత్త నిర్వహణ, పరిసరాల శుభ్రత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు.

మూలమళ్లలో..

మూలమళ్ల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటయ్య, కార్యదర్శి జైపాల్ రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాకార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి నూతన్

వనపర్తి రూరల్: మండలంలోని నాచహళ్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పంచాయతీ కార్యదర్శి నూతన్ బహుమతులు అందజేశారు.

పారిశుద్ధ్యంపై అవగాహన అవసరం

వనపర్తి రూరల్: పారిశుద్ధ్య పనులపై గ్రామంలో ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంఈఓ జయరాములు సూచించారు. శనివారం పెబ్బేరు మండలంలోని యాపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ కోఆర్డినేటర్ యుగంధర్ పాల్గొని పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల ప్రగతి, పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరసింహారావు, హుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాన్‌గల్: ప్రభుత్వ బడుల అభివృద్ధిలో తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని పాన్‌గల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం నరేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు.



మాట్లాడుతున్న ఎంఈఓ జయరాములు

పోరాట వీరుల త్యాగాలు మరువలేనివి

మదనాపురం: మండల కేంద్రంలో ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో శనివారం వీర తెలంగాణ సాయుధ పోరాట శౌర్య యాత్ర కరపత్రాలు విడుదల చేశారు. ఈసందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ.. వీర తెలంగాణ సాయుధ పోరాట వీరుల త్యాగాలు వివరిస్తూ ప్రజానాట్యమండలి కళాకారులతో రాష్ట్రవ్యాప్తంగా సారయాత్రను నిర్వహిస్తున్నామని చెప్పారు.

పీహెచ్‌సీల్లో కాన్పులు సురక్షితం

పాన్‌గల్: గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకుంటూ వైద్యుల సూచనలు పాటించాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్యం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు నిర్దేశించిన రోజు తప్పక పరీక్షలు చేయించుకోవాలని, బలవర్ధకమైన పౌష్టికాహారం, ఆకుకూరలు, పండ్లు తీసుకుంటూ నీరు ఎక్కువగా తాగడం ద్వారా బిడ్డ ఆరోగ్యంగా పుడతారని సూచించారు. గర్భిణులు, బాలింతల పరీక్షలు కోసం పీహెచ్‌సీకి వచ్చేందుకు 102 వాహనం అందుబాటులో ఉందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీహెచ్‌సీలోనే కాన్పులు సురక్షితమన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

ఖిల్లాఘనపురం: మండలంలోని ప్రతి గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడు అన్నారు. శనివారం మండలంలోని మామిడిమాడలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు భద్రు, రవీంద్రాచారి, కేషయ్య, మండల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: నరేంద్రమోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువచేసేందుకే ఇంటింటికీ తిరిగి వివరించాలని బీజేపీ జిల్లా నాయకుడు పురుషోత్తంరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చిమనగుంటపల్లిలో బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. అనంతరం అదే గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రామన్న వెంకటేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సుదర్శన్, వెంకట్‌రెడ్డి, మాధవరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి కలిసి ముందుకెళ్దాం



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నురుల్ నదీం

అమరచింత: పట్టణాభివృద్ధి కోసం కౌన్సిల్ సభ్యులతో కలిసి ముందుకెళ్లడమే కాకుండా నిధుల సేకరణ కోసం ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కలెక్టర్ సహకారం తీసుకుందామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం పట్టణాభివృద్ధిపై చేపట్టాల్సిన కార్యక్రమాలను చర్చించేందుకు చైర్‌పర్సన్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని 10 వార్డుల్లో అసంపూర్తిగా ఉన్న డ్రెయినేజీలు, సీసీ రహదారుల నిర్మాణం కోసం నిధులు అవసరమన్నారు.

లీకేజీలపై ప్రత్యేక చర్యలు..

మిషన్ భగీరథ పైప్‌లైన్లు ఎక్కడ పడితే అక్కడ లీకేజీలు ఏర్పడ్డాయని, దీంతో ప్రజలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, పైప్‌లైన్ల మరమ్మతును వెంటనే చేపట్టాలని ఏఈ రుక్మేందర్‌రెడ్డికి సూచించారు. వారం రోజుల లోపు పట్టణంలోని పూర్తి లీకేజీలను గుర్తించి వాటికి మరమ్మతులు చేపట్టాలని, లేనిపక్షంలో కలెక్టర్‌కు కౌన్సిల్ ద్వారా ఫిర్యాదు చేస్తామన్నారు.

వాటర్‌మెన్లను మార్చొద్దు..

పట్టణంలో తాగునీటిని సరఫరా చేస్తున్న వాటర్ లైన్‌మెన్లు తమ ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తప్పవన్నారు. పలు వార్డుల్లో వాటర్ లైన్‌మెన్లను మార్చాలని తమ దృష్టికి వచ్చిందని, ఇక నుంచైనా వారు నిర్లక్ష్యం వీడాలని మున్సిపల్ కమిషనర్ నురుల్‌నదీం హెచ్చరించారు. ఈ ఏడాది వరకు వారిని మార్చబోమన్నారు. సమావేశంలో మేనేజర్ మహ్మద్, కౌన్సిలర్లు మాధవి, లక్ష్మి, సింధు, ఉషారాణి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించాలి



మరుగుదొడ్లు, చెత్త బుట్టల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాన్‌గల్: కాలకృత్యాలు తీర్చుకోవడానికి బహిర్భూమికి వెళ్లకుండా వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించుకోవాలని తెల్లరాళ్లపల్లితండా పంచాయతీ కార్యదర్శి కుర్మన్న తండావాసులకు అవగాహన కల్పించారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం తండాలో వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం, ఇంకుడుగుంతల నిర్మాణం, పొడి, తడి చెత్త వేరు చేసి ఇవ్వడం, చెత్త బుట్టలను వినియోగించడం వంటి అంశాలపై తండావాసులకు అవగాహన కల్పించారు. తాగునీటి ట్యాంకు పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం తండా ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొని విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శాంతమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ సోమ్లా, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ చిట్టెమ్మ, అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు, తండావాసులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం



మదనాపురం: ఉపాధ్యాయుల సమస్యలపై రాజీ లేని పోరాటం చేస్తామని తపస్ జిల్లా అధ్యక్షుడు వేముల అమరేందర్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన తపస్ మండల కార్యవర్గ సమావేశంలో తిరుమలాయపల్లిలో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కిరణ్‌కుమార్‌ను మదనాపురం తపస్ మండల ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా కిరణ్‌కుమార్‌ను పూలమాల, శాలువాతో అభినందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి విద్యార్థులు ప్రతిభ



పాన్‌గల్: మండల కేంద్రంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీల్లో మండలంలోని కేతేపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు పాఠశాల జీహెచ్‌ఎం శ్రీనివాసులు తెలిపారు. అండర్–14 విభాగంలో బాలుర, బాలికలు ద్వితీయ స్థానం, అండర్–17 విభాగం ఖోఖోలో బాలికలు ద్వితీయ స్థానం, కబడ్డీ, వాలీబాల్ విభాగాల్లో బాలురు ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ప్రోత్సహించిన పీడీ శ్రీదేవిని, విద్యార్థులను ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు. సమావేశంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణ్ బాపూజీకి నివాళి



వనపర్తిటౌన్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షకు ఊపిరి పోసి, వలసాంధ్ర దోపీడిని గుర్తించి ఇడ్లీ సాంబార్ గో బ్యాక్ అంటూ పోరాడిన కొండా లక్ష్మణ్‌బాపూజీ పోరాటాలు మరువలేనివని మహనీయుల స్ఫూర్తి వేదిక రాష్ట్ర చైర్మన్ రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకొని టీజేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గిరిరాజాచారి, నరసింహశర్మ, యేసోప్, పరమేశ్వరచారి, మాధవచారి, సత్యంచారి, రమేష్ చారి తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలం మోజర్ల సమీపంలో గల శ్రీకొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన కళాశాలలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని కళాశాల శాస్త్రవేత్తలు, సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజశేఖర్, డాక్టర్ ఆర్.పూర్ణిమ మిశ్రా, షహనాజ్, జె.శ్రీనివాస్, విద్య, నవ్య, శ్వేత, బేబీరాణి, భాస్కర్, చంద్రశేఖర్ ఉన్నారు.

చెట్లు నరికిన వారిపై ఫిర్యాదు

పాన్‌గల్: మండలంలోని చిక్కేపల్లిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న హరితహారం చెట్లను నరికివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేష్‌కుమార్‌గౌడ్ శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ గ్రామంలో హరితహారంలో నాటిన మొక్కలు పెద్ద చెట్లుగా మారాయని, దీంతో గ్రామానికి చెందిన రాముయాదవ్, వెంకటస్వామి అనే ఇద్దరు వ్యక్తులు ఎలాంటి సమాచారం లేకుండా ఐదు పెద్ద చెట్లు నరికివేశారన్నారు. ఒక పక్క పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలను పెంచాలని చెబుతున్నా.. అందుకు విరుద్ధంగా చెట్లను నరికిన ఇద్దరిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు.

పాఠశాలలో కంప్యూటర్ చోరీ

ఆత్మకూర్: పట్టణంలోని జాతర మైదానం బాలుర ఉన్నత పాఠశాలలో గుర్తు తెలియని దుండగులు కంప్యూటర్‌ను ఎత్తుకెళ్లిన ఘటన శనివారం చోటుచేసుకుంది. జీహెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు సంతోష్‌కుమార్ తన సొంత డబ్బు రూ.లక్ష వెచ్చించి కంప్యూటర్‌తో పాటు ఇతర సౌకర్యాలను సమకూర్చారన్నారు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కంప్యూటర్ ల్యాబ్ గది తాళాలు పగులగొట్టి అందులోని వస్తువులను చిందరవందర చేసి కంప్యూటర్‌తో పాటు విలువైన వస్తువులను ఎత్తుకెళ్లారన్నారు. సమాచారం అందుకున్న ఎస్ నరేందర్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామన్నారు. ఇదివరకే పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారతమాత విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను ఐదేళ్లు గడుస్తున్నా పట్టుకోలేదని, ఇప్పటికైనా కంప్యూటర్‌ను దొంగలను పట్టుకుంటే భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని స్థానికులు కోరుతున్నారు.

వీపనగండ్ల ఫీల్డ్ అసిస్టెంట్ ఆకస్మిక మృతి

వీపనగండ్ల: మండల కేంద్రంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దయ్యపు బాలకృష్ణ(42) శనివారం ఆకస్మికంగా మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాలకృష్ణ మృతదేహానికి డీఆర్‌డీఓ ఉమాదేవి, ఏపీడీ సుల్తాన్ నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.20వేల నగదును మృతుడి భార్యకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ మేనేజర్ వెంకటయ్య, ఏపీఓ శేఖర్‌గౌడ్, పలువురు టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

భర్తపై కేసు నమోదు

పాన్‌గల్: భార్యను వేధించిన ఘటనలో శనివారం భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని బుసిరెడ్డిపల్లికి చెందిన కోమారి మాధవికి కోమారి ఆంజనేయులుతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న ఆంజనేయులు వివాహం జరిగినప్పటి నుంచి వరకట్నం తేవాలని, అనుమానంతో మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని బాధితురాలు వాపోయింది. ఈనెల 15న రాత్రి సమయంలో అత్త కృష్ణమ్మ, ముగ్గురు పిల్లలు గ్రామంలోని వినాయకుడి మండపం వద్దకు వెళ్లగా.. భర్త అకారణంగా గొడవకు దిగి కట్నం తీసుకరావాలని కొట్టాడని, దీంతో తలకు, కుడి కాలు మోకాలి కింద రక్తగాయాలని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇంటి వచ్చిన అత్త జిల్లా ఆస్పత్రికి తరలించిందన్నారు. కోమారి మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.